# రెండో జన్మ

మళయాళ మూలం :
కమలాదాస్
తెలుగు సేత :
ఎల్. ఆర్. స్వామి

భర్త పోగానే, స్త్రీకి తన శరీరం పట్ల శ్రద్ధ తగ్గిపోతుంది. తన అందాన్ని, శారీరక విలువలని గుర్తించిన వ్యక్తి పోవటంతో, తన సౌందర్య పరిరక్షణలోని జాగ్రత్తలని, స్త్రీ మెల్ల మెల్లగా సడలిస్తుంది. తలంటులు, సుగంధ ద్రవ్యాల వాడుక తగ్గుతుంది. భర్త కోసమే అలంకరించుకున్న ఆమె, అలంకరణపై ఆసక్తి చూపదు.

శారీరక విలువలు తగ్గిన స్త్రీ సతిగా మారుతుంది. తన మనస్సులోని చితిలో మండుతునే వుంటుంది.

భర్త బ్రతికివున్నప్పుడు తెల్లవారగానే లేచేది, ఆమె స్నానము చేసి, మంచి బట్టలు ధరించి సుగంధ ద్రవ్యములు పులుముకోనిదే, భర్తని సమీపించేది కాదు. ఆమె అందించిన కాఫీ చప్పరిస్తునే అతని రోజు ప్రారంభమయ్యేది. భూమికి పర్యాయపదం స్త్రీ. విత్తనములోని జీవం ఆమె ! అందువల్లే కాబోలు మరణం దగ్గర పడినప్పుడు ఆమె చేతులు వొదలకుండా, గట్టిగా పట్టుకున్నాడు, ఆమె భర్త. ఆమె చేతులు తను వొదలనంతకాలం తను బ్రతుకు తాడనేది, అతని నమ్మకం. "మీరు ఎక్కడకు వెళ్ళాలని నిర్ణయించారు" భర్త పోయాక మిత్రులు అడిగారు.

పిల్లలు ఇంటికి కాని, ఊరులో తాళం వేసి వున్న సొంత ఇంటికి కాని, ఆమె వెళ్ళిపోతుందని అనుకున్నారు, వాళ్ళు. కాని తను అద్దెయింటిలోనే వుండాలని నిర్ణయించుకుంది ఆమె. అద్దెయిల్లు చాలా విశాలమైనది. అందమైనదికూడ భార్యా భర్తలిద్దరూ కలిసి వుండటానికి అనువైన ఇల్లు. దురదృష్టమువల్ల ఒక రెక్కవిరిగిన ఆమె అక్కడే వుండటం భరించలేక పోయారు మిత్రులు.

భర్త ధరించిన రుద్రాక్షలు కావాలని అడిగాడు ఒక మిత్రుడు. మరొక్కరు అతను సేకరించిన పుస్తకాలన్ని కావాలన్నారు.

తన భర్త పాదరక్షలకు, పోలిష్ చేసి స్టాండుపైనే వుంచింది ఆమె. ఆ పాదరక్షలు ధరించిన పాదాల గురించి గుర్తు చేసుకుంటూనే వుండేది. నీరు చేరి లావెక్కిన ఆ పాదాలని నిమిరిన క్షణాలు గుర్తుకు వచ్చి ఆమె కళ్ళు నిండాయి. కాళ్ళ గోరులని కత్తిరించమని అతను అడిగినప్పుడు, కత్తిరించలేక పోయిన తన పిరికితనాన్ని తిట్టుకుంది.

స్వర్గలోక వాసులకు గోళ్ళు పెరుగుతాయా ?

"మన స్వర్గం ఇక్కడే" భర్త ఆమెకు చెప్తూ వుండేవాడు.

"ఈ ఇల్లే మనకు స్వర్గం. నీతో గడిపే ఈ జీవితమే నాకు స్వర్గం."

అతను చెప్పిన స్వర్గములో పాడే గంధర్వులు కాని, నాట్యం చేసే ఊర్వశి, రంభలు కాని వుండేవారు కాదు - అప్పుడప్పుడు వాళ్ళు నవ్వుతూ వుండేవారు అంతే.

ఏదో పరిశీలనా పని గురించి పాటియాలా విశ్వ విద్యాలయం నుంచి వచ్చిన ప్రొఫెసర్ కౌర్ ఒకసారి ఆమెని అడిగారు. "మీరు ఇంకా విడాకులు తీసుకోలేదా. కారణం?"

ఆ ప్రశ్నకి ఆమె ఇచ్చిన జవాబు చాలా పాతదే. తను తన భర్త చాలా అన్యోన్యంగా వుంటామనే ఆమె జవాబు కౌర్‌ని చాలా ఆశ్చర్యపరిచింది. స్త్రీల హక్కుల గురించి పోట్లాడే ఆమె అన్యోన్య దాంపత్యమనే పదం వాడుతుందని కౌర్ అనుకోలేదు కాబోలు ! వాళ్ళ దాంపత్యం గురించి ఆమె పనిమనిషిని కూడా అడిగిందట ! ఆమె, ఆమె భర్త కీచులాడుకోరనే మాట విని, కౌర్ మోము మాడిపోయిందట!

జబ్బు చేసి మంచమెక్కినప్పుడు భర్త అడుగుతునే వుండేవాడు "నేను నీకు ఇబ్బంది కలిగిస్తున్నాను కదూ...."

ఆమె జవాబు చెప్పలేక పోయేది. ఇబ్బంది లేదని కాని ఉన్నదని కాని చెప్పటానికి మనస్సు వొప్పుకోలేదు.

వైధవ్యం స్త్రీకి ఒక అనాధ కుక్కకి వున్న స్వాతంత్రతని ప్రసాదించవచ్చును.

ఆమె మండుటెండలో నడవవచ్చును. జడివానలో తిరగవచ్చును. కాని ఆమెని పిలిచి తలవొత్తుకోమనే సలహా ఇచ్చేవారు వుండరు.

వైధవ్యమిస్తుంది రెండో జన్మ. నష్టాల లెక్కలు వేసి ఆరెండో జన్మలో, ఆమెకి మిగులు, మొదటి జన్మలో అందిన ప్రేమ, అనురాగం, పరువు ప్రతిష్టలు మాత్రమే !

సత్వర బట్వాడా కోసం

ఊరు నెంబర్లు
డోరు నెంబర్లు
తప్పకుండా వేయాలి
చినుకు చందా మెంబర్లు